బోనాలకు భద్రతా ఏర్పాట్ల పరిశీలన



దేవాలయ పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ, ఈవో, ఇన్‌స్పెక్టర్లు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు పోలీసులు భద్రతా ఏర్పాట్లు మొదలు పెట్టారు. జూలై 21,22వ తేదీల్లో జరుగనున్న బోనాలకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతి ఏటా లక్షల మంది భక్తులు పాల్గొంటుండగా.. ఏటేటా ఆ సంఖ్య పెరుగుతూనే వస్తుంది. సోమవారం మహంకాళి ఈవో మనోహర్‌రెడ్డి, మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్‌లు దేవాలయ పరిసర ప్రాంతాల్లో తిరిగి భక్తుల భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. గతేడాది తలెత్తిన సమస్యలు, భక్తుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని తిరిగి పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపడతామని ఏసీపీ, ఈవోలు తెలిపారు. భక్తులు, స్వచ్ఛంద సంస్థలు, ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు జాతర విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తామన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన స్థానిక నేతలు



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో బౌద్ధనగర్ నేతలు

బౌద్ధనగర్: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను బౌద్ధనగర్‌కు చెందిన బీజేపీ నేతలు ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రమంత్రి బండిసంజయ్‌ను కలిసిన వారిలో జాయింట్ కన్వీనర్ సాయిదత్తు, వినయ్ కుమార్‌గుప్తా, బైరి సురేష్ పాల్గొన్నారు.

పరామర్శ

సనత్‌నగర్: మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఎస్‌ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు పరామర్శించారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న సీనియర్ సిటిజన్స్ సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసానికి చేరుకుని శ్రీనివాస్‌యాదవ్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కౌన్సిల్ అధ్యక్షుడు మాణిక్‌రావ్ పాటిల్, ముత్తారెడ్డి, శంకర్, పార్థసారధి, కృష్ణారెడ్డి, కృష్ణదేవ్‌గౌడ్, అరవింద్‌గౌడ్, ప్రసాద్ ఉన్నారు.



ఎమ్మెల్యే తలసానిని పరామర్శిస్తున్న దృశ్యం

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం



బేగంపేటలో జలమయమైన రహదారి

సనత్‌నగర్: కుంభవృష్టిగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్ల వ్యాప్తంగా కుండపోత వర్షంతో అతలాకుతలమయ్యారు. చాలాచోట్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమీర్‌పేట, బల్కంపేట, బేగంపేట, కుందన్‌బాగ్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఇక ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. విరిగిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ టీమ్‌లు రంగంలోకి దిగాయి. రాత్రైనా కూడా పలుచోట్ల విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. శివాజీనగర్, చుట్టుపక్కల కాలనీలు సోమవారం సాయంత్రం అంధకారంలోనే మగ్గాయి. ఇక్కడ కరెంటు ఆఫీసు ల్యాండ్‌లైన్ ఫోన్ కూడా పనిచేయని దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోయారు.

కేసీఆర్ ఆశీర్వాదం..



కేసీఆర్‌తో మహంకాళి శర్వీన్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహంకాలి శర్వీన్, తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లో పరిస్థితులపై కేసీఆర్‌కు వివరించినట్లు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం కల్పించేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని కేసీఆర్ సూచించినట్లు పేర్కొన్నారు. అనంతరం శర్వీన్‌కు మాజీ సీఎం ఆశీర్వదించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు

లాలాపేట: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డిని లాలాపేటకు చెందిన కుమ్మరి సంఘం నాయకులు ఆంజనేయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కుమ్మర్ల సంక్షేమానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కేంద్రమంత్రిని కోరారు.



ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సమస్యలు వివరిస్తున్న రుద్రాక్ష మల్లేష్

లిబర్టీ: ఆటో డ్రైవర్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అఖిలభారత అసంఘటిత కార్మిక, ఉద్యోగుల సంఘం ఆటో విభాగం రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక మల్లేష్ సారథ్యంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ. 12 వేలు వెంటనే చెల్లించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12 వేలు చెల్లిస్తామని ఎన్నికల ప్రణాళికలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి లేక ఆటోలు అద్దెకి తీసుకోని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు బ్యాంకు ప్రధాన రుణాలు ఇప్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వాలని ప్రభుత్వం సంక్షేమ పథకాలను మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల నుంచి వేధింపులు ఆపాలని విన్నవించారు. స్పందించిన మంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 12 వేలు చెల్లిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారన్నారు.

గోశాలకు ఎద్దుల తరలింపు

రహమత్‌నగర్: సరైన సౌకర్యాలు లేని వాహనంలో తరలిస్తున్న రెండు ఎద్దులను బోరబండ పోలీసులు గోశాలకు తరలించారు. సెక్టార్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ సమాచారం మేరకు... బక్రీద్ నేపథ్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం రాత్రి మోతీనగర్ వద్ద ఓ వాహనం ఆపకుండా వెళ్లింది. డ్రైవర్ అదుపులోకి తీసుకుని వాహనం తనిఖీ చేయగా.. రెండు ఎద్దులు ఉన్నాయి. వాటికి గడ్డి, తాగునీరు లేకుండా ఉండటాన్ని గమనించిన పోలీసులు డ్రైవర్‌ను విచారించి, ఎద్దులను గోశాలకు తరలించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



బాలంరాయి ఈద్గాలో..

భక్తి శ్రద్ధలతో బక్రీద్

సికింద్రాబాద్/సనత్‌నగర్/కంటోన్మెంట్ జోన్ల పరిధిలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచే ముస్లింలు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నమాజ్ అనంతరం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సందేశాన్ని ఆచరిస్తూ సమైక్యతతో అందరూ కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

– సికింద్రాబాద్/సనత్‌నగర్/కంటోన్మెంట్ జోన్ల బృందం



సహపంక్తి భోజనం చేస్తూ..





శేషాపహాడ్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కూరగాయల ధరలు



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో/రూ.ల్లో) టమాటా రూ.47, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 80, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 60, పందిరి బీర 72, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండకాయ 45, గుండుబీన్స్ 145, గింజ చిక్కుడు 65, గోకరకాయ 55, కీర 38, దోసకాయ 23, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 45, సొరకాయ 17, పొట్లకాయ 20, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6 గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అనారోగ్యంతో బీఆర్‌ఎస్ నేత మృతి

సనత్‌నగర్: బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్స్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత యాదగిరిగౌడ్ (76) మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతూ.. గతవారం రోజులుగా బేగంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి, సత్యనారాయణ, సురేష్ యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్‌ను నియమించినట్లు సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న త్రిసభ్య కమిటీ పూర్తిగా విఫలమైందని, దానిని రద్దు చేసి పంచ సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేనా రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సేవాలాల్ సేనా కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షుడిగా రమేశ్ మహరాజ్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ నాయక్, ఉద్యోగ సేనా రాష్ట్ర ఇన్‌చార్జిగా మూడావత్ కృష్ణానాయక్, కోకన్వీనర్లుగా బానోత్ హుస్సేన్‌నాయక్, వెంకన్ననాయక్, అజయ్‌నాయక్, మోతీలాల్‌నాయక్, భాస్కర్ నాయక్, కొర్రా శ్రీను, రాజేశ్‌నాయక్, బానోత్ బాలునాయక్, శంకర్‌నాయక్, హైదరాబాద్ సీనియర్ నాయకులు కల్యాణ్‌నాయక్, శశిప్రసాద్, బానోత్ కిషన్‌నాయక్, రవినాయక్, రామునాయక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కంబర్ ల్యాండ్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మార్క్

అమీర్‌పేట: యూఎస్‌లోని కంబర్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.మార్క్ హన్నా తెలిపారు. సోమవారం అమీర్‌పేట్‌లో వివరాలను వెల్లడించారు. నేడు అమీర్‌పేట ఆదిత్యపార్క్ హోటల్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని ప్రకటించారు. అధునాతన డిగ్రీ కోర్సులతో పాటు మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, ఐటీ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు వివరించారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు కలిగి ఉన్న విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ కోర్సులను జనాభా అవసరాలకు అనుగుణంగా రూపొందించినట్లు స్పష్టం చేశారు. ఐటీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ రంగాల్లో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. నగరంలోని యూనివర్సిటీ హబ్‌తో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నామని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రమాదకర మ్యాన్‌హోళ్లపై రంగులతో అవగాహన



మ్యాన్‌హోల్స్‌పై ఎరుపు రంగు వేస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: వానాకాలంలో వరదలు ముంచెత్తినప్పుడు లోతైన మ్యాన్‌హోళ్ల మూతలు తెరిచి ఉంటే ఏర్పడబోయే అనర్థాలను దృష్టిలో పెట్టుకుని జలమండలి సిబ్బంది పాదచారులు, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు మ్యాన్‌హోల్ మూతలపై ఎరుపురంగు వేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా లోతైన మ్యాన్‌హోళ్లను గుర్తించి మూతల కింద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటుచేస్తూ మూతల పైన ప్రమాదకర హెచ్చరికతో కూడిన రెడ్‌మార్క్ వేస్తూ అలెర్ట్ చేస్తున్నారు. ఇప్పటికే వంద శాతం మ్యాన్‌హోల్ మూతలపై రెడ్ మార్కింగ్‌లు వేయడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో వర్షాకాలంలో జాగ్రత్తలు–హెచ్చరికలు పేరుతో బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మొదటిసారిగా ఈ సారి ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. వరదలు వచ్చినప్పుడు రెడ్‌మార్క్ ఉన్న మ్యాన్‌హోళ్ల పక్క నుంచి జాగ్రత్తగా వెళ్లాలని, ఎట్టిపరిస్థితిలో మూతలు తెరవవద్దని జాగ్రత్తలతో కూడిన అవగాహన అవగాహన కల్పిస్తున్నారు.

సిగరెట్ ప్యాకెట్ల చోరీపై ఫిర్యాదు

వెంగళరావునగర్: బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్ లాంటి ఏరియాల్లో కుక్కలు తప్పిపోయాయంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే లేనిది, తాను సిగరెట్లు పోయాయని కంప్లైంట్ ఇస్తే తప్పేంటని అనుకున్నాడో ఏమో ఓ దుకాణదారుడు సోమవారం నేరుగా మధురానగర్ పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. సిగరెట్ పాకెట్లు కూడా తన కష్టార్జితమే నంటూ పోలీసులను కేసు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జవహర్‌నగర్‌కు చెందిన ఎ.రమేష్ అనే వ్యక్తి ఆరు నెలలుగా యూసుఫ్‌గూడ బస్తీలో టీ దుకాణం నడుపుతున్నారు. ఈ నెల 14వ తేదీ రాత్రి షాపు మూసి 15 ఉదయం ఓపెన్ చేయడానికి వచ్చాడు. కాగా తన షాపును గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి ఉండటాన్ని గమనించాడు. షాపును పరిశీలించగా అందులో ఉండాల్సిన 30 పాకెట్ల సిగరెట్లు, దాంతో పాటుగా రూ. 5 వేలు నగదు మాయం అయ్యాయి. బాధితుడు చుట్టుపక్కల విచారించిన అనంతరం సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సిగరెట్ పాకెట్ల కోసం ఫిర్యాదు ఏందని అనుకున్న పోలీసులు చివరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోర్‌వెల్ నిర్వాహకుడిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా బోర్‌వెల్ నిర్వాహకుడిపై బీఆర్‌ఎస్ నేతలు దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరాంనగర్‌కు చెందిన మహ్మద్ షకీర్ బోర్‌వెల్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ఈనెల 16వ తేదీ రాత్రి రహమత్‌నగర్‌కు వచ్చి ఒక వ్యక్తితో బోర్‌వెల్ గురించి మాట్లాడుకుని తిరిగి బోర్‌వెల్ వాహనంలో వెళుతున్నాడు. హనుమాన్ దేవాలయం వద్ద ఇరుకుగా ఉండటంతో వాహనాన్ని డ్రైవర్ వెంకటేష్ రివర్స్ చేస్తుండగా సమీపంలోని నివసించే అరుణ్, మహేష్ అనే వ్యక్తులు వచ్చి అకారణంగా దూషించారు. ఇంటికి ఏమైనా డ్యామేజ్ అయితే తాను బాగు చేయిస్తానని షకీర్ చెబుతున్నప్పటికీ ఆగకుండా ఇరువురు అన్నదమ్ములు డ్రైవర్ వెంకటేష్‌ను గ్రనేట్ రాయితో షకీర్‌ను రాడ్డుతో తలపై కొట్టారు. బాధితులు ఆసుపత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని రర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆ విభాగం అధికారులు, సిబ్బంది నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నిత్యం రోడ్లపై విధులు నిర్వహిస్తూ.. ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం వేలాది వాహనాల సంచారం .. ప్రజల రాకపోకలు ట్రాఫిక్ సందడితో కిటకిటలాడే ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.

ప్రజల సౌకర్యార్థం సంప్రదించాల్సిన నంబర్లు..

◆ ఎస్. వెంకటేశ్వర్లు(ఏసీపీ)	87126 60613
◆ బి.వెంకట్ రాములు(గోపాలపురం ఇన్‌స్పెక్టర్)	87126 60621
◆ పి. ఉపశంకర్(మహంకాళి ఇన్‌స్పెక్టర్)	87126 60622
◆ జి. భాస్కర్(మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్)	87126 60625
◆ ఎల్. మధుబాబు(తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్)	87126 60624
◆ పి. పాపయ్య(బేగంపేట్ ఇన్‌స్పెక్టర్)	87126 60632
◆ వి. నాగయ్య(బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్)	87126 60751
◆ సీహెచ్ శ్రీనివాసులు(చిలకలగూడ ఇన్‌స్పెక్టర్)	87126 60753

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం



శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డిలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: ఈనెల 20న తన ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలను ఆహ్వానించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ముందుగానే కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముహూర్తం ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిలను కలిసి ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌లను కలిశారు. సంతోష్‌యాదవ్, శివకుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఐస్ స్కేటింగ్' నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు దీపక్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ/లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ వార్షిక జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2024–28 సంవత్సరానికి అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. తెలంగాణ ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దీపక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా అయేషా ఇరం, కోశాధికారిగా మజీద్, ఉపాధ్యక్షులుగా మొహమ్మద్ ఖాజా పాషా, మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సంయుక్త కార్యదర్శిగా కవిత సూరపనేని, సభ్యులుగా మహ్మద్ తాహిర్ అలీ, రాజిరెడ్డి, సలీమ్, జితేందర్‌కుమార్, మహ్మద్ మజారుద్దీన్ తదితరులున్నారు.

విద్యుత్ వైర్లకు మంటలు !



సనత్‌నగర్ వెజిటెబుల్ మార్కెట్ వద్ద..

సనత్‌నగర్: సనత్‌నగర్ కూరగాయల మార్కెట్ దగ్గర సోమవారం మధ్యాహ్నం నుంచి స్తంభానికి ఉన్న వైర్ల నుంచి మంటలు వ్యాపిస్తున్నా.. విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఓవైపు ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూతవేటు దూరంలోనే విద్యుత్ శాఖ కార్యాలయం ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరద సహాయక చర్యల్లో జాప్యం తగదు

శ్రీనగర్‌కాలనీ: భారీ వర్షాలకు డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, సహాయ చర్యలు చేపట్టే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందని మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ ఆరోపించారు. సోమవారం వికాస్‌పురికాలనీలో ఆయన మాట్లాడుతూ... గాలి, వర్షాలకు చెట్లు కూలిపోతున్నాయన్నారు. ఎమర్జెన్సీ మాన్‌సూన్ బృందం జాడ కానరావడం లేదని ఆరోపించారు. విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టే విషయంలో పూర్తిగా విఫలమవుతున్నారని, ప్రజలు, ప్రజాప్రతినిధుల ఫోన్లు సైతం ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా మూడు నెలలపాటు వర్షాలు కురుస్తాయని గుర్తుచేశారు. అలాంటప్పుడు జీహెచ్ ఎంసీ, విద్యుత్ అధికారులు ముందస్తు కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నీట్ పరీక్షపై ప్రధాని స్పందించాలి

కాచిగూడ: నీట్ పరీక్ష విషయంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఈ మేరకు లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం తగదని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ పెద్ద స్కాం అని, ఒక్కో అభ్యర్థికి రూ.30 లక్షల చొప్పున పేపర్‌ను అమ్ముకున్నారనే వార్తలొస్తున్నాయని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పోరాటం చేస్తామని తెలిపారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు ప్రతీ విద్యార్థి నేర్చుకోవాల్సిన 50కి పైగా లేటెస్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9505800050.